క్లుప్తంగా

భజరంగ్‌ను సన్మానించిన మంత్రి కోమటిరెడ్డి



భజరంగ్‌ను సన్మానిస్తున్న మంత్రి

నల్లగొండ టౌన్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో రెండు అవార్డులు పొందిన సాక్షి సీనియర్ ఫొటో జర్నలిస్ట్ కంది భజరంగ్ ప్రసాద్‌ను రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురువారం ఆయన నివాసంలో సన్మానించారు. భజరంగ్ ప్రసాద్ అవార్డులు సాధించడం అభినందనీయమని మంత్రి అన్నారు.

జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ప్రమీల

నల్లగొండటౌన్: నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రమీలకు చీఫ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందడంతో ఆమెను గురువారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో నర్సింగ్ స్టాఫ్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నీలాబాయి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

నకిరేకల్ : వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన వారికోసం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్, నకిరేకల్ జాయ్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.మమత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ తెలుగు, ఇంగ్లిష్ మీడియం గ్రూపుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ రెండు సంవత్సరాల కోర్సు ఒకే సంవత్సరంలో పూర్తి చేసుకునే అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు నకిరేకల్ జాయ్ కళాశాలలోని స్టడీ సెంటర్‌లో లేదా 9381642469, 9985927191 సెల్ నంబర్లను సంప్రదించాలని వివరించారు.

సంతకాల సేకరణ

చండూరు(గట్టుప్పల్) : డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్ ఆమోదించి తగిన నిధులు కేటాయించాలని కోరుతూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో గట్టుప్పల్ మండల కేంద్రంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పర్యావరణ అనుమతులు ఇచ్చి మునుగోడు నియోజకవర్గంలోని చర్లగూడెం, శివన్నగూడెం ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి ఖమ్మం రాములు, కర్నాటి వెంకటేశం, కిన్నెర భిక్షమయ్య, పెదగాని నరసింహ, కర్నాటి యాదయ్య, చెన్నయ్య, వెంకటేశం, నరసింహ, రాములు, మారయ్య పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

నకిరేకల్ : మండల పరిధిలోని చందుపట్ల గ్రామానికి చెందిన ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ వినియోగదారుడు ఆలకుంట్ల నరేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. నరేష్‌కు ఎయిర్‌టెల్ నుంచి మంజూరైన రూ.5 లక్షల బీమా చెక్కును గురువారం అతడి తల్లి మంగమ్మకు ఆ బ్యాంక్ జోనల్ మేనేజర్ పంజాల రమేష్, జిల్లా ట్రెజరరీ మేనేజర్ శ్యామల సుందర చైతన్య అందజేశారు. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ లో ఖాతా తెరిచిన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షలు ఉచిత ప్రమాద బీమా వర్తిసుందని జోనల్ మేనేజర్ తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజానికి పాటుపడాలి

శాలిగౌరారం: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎస్ఐ సైదులు అన్నారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ఆకారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వల్ల జరిగే అనర్థాల గురించి ఎస్ఐ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ల అధ్యక్షుడిగా దామోదరాచారి

నాంపల్లి : ముష్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మండల కేంద్రానికి చెందిన బిరుదోజు దామోదరాచారి స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా గురువారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహేష్ పంతులు

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి గ్రామ శ్రీ సీతారామాంజనేయ సహిత అంబికా జగదీశ్వరాలయం పురోహితుడు బోగ మహేష్ పంతులు తెలంగాణ పద్మబ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రుద్ర పాండురంగశాస్త్రి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

అడుగంటిన భూగర్భ జలాలు

- తగ్గిన పంటల సాగు విస్తీర్ణం
- ఆందోళనలో అన్నదాతలు
- కాల్వలకు నీటిని విడుదల చేయాలని వేడుకోలు

తిప్పర్తి : వర్షాభావ పరిస్థితులకు భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. వానాకాలం సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు భారీ వర్షాలు లేక బోరుబావులు, చెరువుల్లో చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. దీంతో తిప్పర్తి మండలంలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పంటల సాగు తగ్గిపోయింది. ఐదు ఎకరాలు ఉన్న రైతులు కొద్దోగొప్పో నీరు ఉన్న రైతులు ఎకరం, రెండు ఎకరాలనే సాగు చేస్తున్నారు. మరికొందరు కాల్వల ద్వారా నీరు విడుదల చేస్తారని ఆశతో ఎదురుచూస్తున్నారు.



తిప్పర్తి మండలం మర్రిగూడలో ఆగిపోస్తున్న బోరు

వరి 20వేల ఎకరాలు.. పత్తి 4,700 ఎకరాలు..

భూగర్భ జలాలు అడుగంటంతో మండలవ్యాప్తంగా రైతులు తమ పంటల సాగు విస్తీర్ణం తగ్గించుకున్నారు. గత వానాకాలం సీజన్‌లో వరి 30వేల ఎకరాల్లో సాగు చేసినప్పటికీ ప్రస్తుత సీజన్‌లో 20వేల ఎకరాలకే పరిమితమైంది. అదే విధంగా గత సీజన్‌లో పత్తి 5100 ఎకరాల్లో సాగు చేయగా ప్రస్తుతం 4700 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. తిప్పర్తి మండలంలోని డిస్ట్రిబ్యూటరీ 37,39,40 కాలువల ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు కుంటలు నింపితే పంటలను కాపాడుకోవచ్చని రైతులు పేర్కొంటున్నారు. లేకుంటే ఉన్న పంటలు కూడా ఎండిపోయే పరిస్థితి ఉంటుందని రైతులు వాపోతున్నారు.

కాల్వలకు నీటిని విడుదల చేయాలి

గత సీజన్‌లో 9ఎకరాల్లో వరిసాగు చేశా. నాకు రెండు బోర్లు ఉన్నాయి. వాటితో తొమ్మిది ఎకరాలు సాగయ్యేది. ప్రస్తుతం రెండు బోర్లు ఆగి ఆగి పోస్తున్నాయి. నీరు లేక నాలుగు ఎకరాల్లోనే వరి సాగు చేస్తున్నా. పరిస్థితి ఇలానే ఉంటే వేసిన పంటలు ఎండిపోతాయి. కాల్వలకు నీటిని విడుదల చేయాలి

– కస్పరాజు సైదులు, రైతు, తిప్పర్తి



సాగు విస్తీర్ణం తగ్గింది

తిప్పర్తి మండలంలో గతంలో కంటే సాగు విస్తీర్ణం తగ్గింది. సరైన వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. గతంలో 30 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా ప్రస్తుతం 20వేల ఎకరాలకు పరిమితమైంది. పత్తి సాగును కూడా తగ్గించారు.

–సన్నిరాజు, ఏఓ, తిప్పర్తి



ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

నకిరేకల్ : వాడుక భాషకు రచనల్లో పట్టం కట్టి శ్రామికుల తెలుగుకు జైకొట్టిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి అని నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గురువారం నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతిని వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా తెలుగు కవి ఇంద్రాసేనారెడ్డిని సత్కరించారు. అధ్యాపకులు హబీబ్ పాష, నాగు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, హరిత, శంకర్, మధుసూదన్‌రెడ్డి, నర్సింహాచారి, శివశంకర్, శ్రీను, ఉపేందర్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

కేతేపల్లి : మండలంలోని భీమవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సిబ్బంది గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె భిక్షమయ్య, ఉపాధ్యాయులు లింగయ్య, జానకిరెడ్డి, రమేష్, వెంకటేశ్వర్లు, శివయ్య, శ్రీధర్, శేఖర్, నాగయ్య పాల్గొన్నారు.

చిట్యాల: పట్టణంలోని లోయోలా టెక్నో స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్కూల్‌లో తెలుగు భాషోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు ఎండీ.జమీరోద్దీన్, డైరెక్టర్లు తీగల కిరణ్, మోర్తాల వెంకన్న, బెల్లపు శ్రావణ్ పాల్గొన్నారు.



నకిరేకల్ : కవి ఇంద్రాసేనారెడ్డిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ యాదయ్య, అధ్యాపకులు

మర్రిగూడ : దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మంజులత, కొండ శ్రీను, అమీనా పాల్గొన్నారు.

క్రీడల్లో దేశానికి గుర్తింపు తీసుకురావాలి



నల్లగొండ టూటౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న క్రీడాకారులు



ఎన్జీ కళాశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

రామగిరి(నల్లగొండ): క్రీడల్లో రాణించి దేశానికి గుర్తింపు తీసుకురావాలని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం కళాశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ స్ఫూర్తిగా యువత క్రీడల్లో రాణించి దేశానికి పతకాలు సాధించాలన్నారు. ఇన్‌చార్జ్ ఫిజికల్ డైరెక్టర్ ఏ.మల్లేశం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోటయ్య, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ వెల్దండి శ్రీధర్, అధ్యాపకులు వెంకట్ రెడ్డి, చంద్రయ్య, కందుకూరి దుర్గాప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ర్యాలీ

నల్లగొండ టూటౌన్: జాతీయ క్రీడా దినోత్సవం, ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నల్లగొండ ఫుట్‌బాల్ అసోసియేషన్, కేకేఆర్ ఫుట్‌బాల్ అకాడమి, నీలగిరి ఫుట్‌బాల్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో గురువారం పెద్ద గడియారం చౌరస్తా నుంచి క్రీడాకారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారు ప్రసాద్, డాక్టర్ పుల్లారావు, ఓరుగంటి శ్రీనివాస్, గుర్రం వెంకన్న, దాస్, సునిత, దాసు, ఓరుగంటి రాములు పాల్గొన్నారు.

చిట్యాల: పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ స్కూల్‌లో గురువారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానించారు. స్కూల్ డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్‌రెడ్డి, పీఈటీ గంగాపురం రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై చర్యలు

నల్లగొండ: సెప్టెంబరు 30లోగా సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై చర్యలు తీసుకుంటామని డీఎస్ఓ వెంకటేశ్వర్లు ఎఫ్‌సీఐ మేనేజర్‌కు సూచించారు. గురువారం డీఎం హరీష్‌తో కలిసి ఎఫ్‌సీఎస్ కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మిల్లర్లు సీఎంఆర్‌ను తీసుకొచ్చిన సమయంలో ఎఫ్‌సీఐలో అందుకు అనుగుణంగా స్థలాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు సీఎంఆర్ డెలివరీ వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఖరీఫ్ 2023–24కు సంబంధించి 32,275 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లింగ్ కోసం మిల్లర్లకు కేటాయించినట్లు చెప్పారు. 16,258 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండగా జిల్లాలో 75 శాతం ఇప్పటికే పూర్తి చేసి మొదటి స్థానంలో ఉన్నామన్నారు. 2023–24 రబీకి సంబంధించి 3,26,012 మెట్రిక్ టన్నుల వరిధాన్యం మిల్లర్లకు అప్పగించగా 57 శాతం ఇప్పటికే సీఎంఆర్ పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ లింగస్వామి తదితరులున్నారు.



ఎఫ్‌సీఎస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్ఓ

తీరిన ట్రాఫిక్ సమస్య



రోడ్డుపై కూరగాయలు అమ్ముతుండగా మరొక చోటుకు మారుస్తున్న పోలీసులు

మునుగోడు: నియోజకవర్గ కేంద్రమైన మునుగోడులో కొన్నేళ్లుగా వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య తీరింది. ప్రతి గురువారం వారాంతపు సంత మునుగోడు –నల్లగొండ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న గ్రామ పంచాయతీ స్థలంలో నిర్వహిస్తారు. అయితే సంత స్థలం చిన్నదిగా ఉండడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా కూరగాయలు, పండ్ల వ్యాపారులతోపాటు ఇతర వ్యాపారులు తమ వస్తువులను విక్రయించేవారు. దీంతో ఆ రోడ్డు వెంట ఏదైనా పెద్ద వాహనం వస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారి ట్రాఫిక్ సమస్య ఏర్పడేది. ఈ సమస్యపై అనేకమార్లు సాక్షి దినపత్రికలో కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. దీంతో ఎస్.ఐ వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి సంత స్థలానికి ఆనుకుని ఉన్న కాలనీ రోడ్ల వెంట వ్యాపారులు తమ వస్తువులను పెట్టుకుని అమ్ముకునేలా ఏర్పాట్లు చేశారు.

బీజేపీ సమావేశం

నకిరేకల్ : ప్రతి గ్రామంలోని బూత్‌లో అత్యధిక సభ్యత్వాలు నమోదయ్యేలా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నకిరేకంటి మొగిలయ్య కోరారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యశాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల శాఖ అధ్యక్షుడు యానాల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, పార్టీ నాయకులు యానాల శంకర్‌రెడ్డి, గుడుగుంట్ల సాయన్న, జిల్లా డాకయ్య, చనగాని రాములు, బండమీది శ్రీకాంత్, శేఖర్, లక్ష్మయ్య, కారింగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

మునుగోడు: రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంప చెట్లతో బస్సు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని గత బుధవారం రద్దుచేసిన పలివెల బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు గురువారం పునరుద్ధరించారు. బస్సు సర్వీసును రద్దుచేయడంతో వివిధ గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై గురువారం సాక్షి దినపత్రికలో పలివెల మీదుగా వెళ్లే బస్సు సర్వీసు రద్దు అనే కథనం ప్రచురితమైంది. సాక్షి కథనంపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగింపజేస్తామని, బస్సు సర్వీసును యథావిధిగా నడిపించాలని సూచించారు. ఎమ్మెల్యే హామీ మేరకు అధికారులు బస్సు సర్వీసును యథావిధిగా నడిపిస్తున్నారు.

ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తిచేస్తా

- రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కనగల్: చిన మాదారంలో విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కనగల్: ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తిచేసే బాధ్యత తనదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం కనగల్ మండలం చినమాదారం గ్రామంలో రూ.మూడు కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ నల్లగొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రూ.100 కోట్లతో సీసీరోడ్లు, డ్రైయినేజీలు వేయిస్తానని హామీ ఇచ్చారు. చినమాదారం మీదుగా కనగల్ వరకు రూ.15 కోట్లతో డబుల్ రోడ్డుకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించామన్నారు. ప్రధాన రహదారి కలిసే వరకు మరో రూ.15 కోట్లతో రోడ్డు విస్తరణ చేపడతామన్నారు. ఎస్ఎల్‌బీసీ పనులను పూర్తి చేసేందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.2200 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. సొరంగం తవ్వే మిషన్ మరమ్మతు కారణంగా ఆగిపోయిందని, అమెరికా నుంచి విడిభాగాలు తెప్పించి పనులు ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఎస్ఈ బాలరాజు, డీఈ వెంకటేష్, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రవి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి , గడ్డం అనూప్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, మందడి రామచంద్రారెడ్డి, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, గోలి జగాల్ రెడ్డి, దేప నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షుడు కూసుకుంట్ల రాజిరెడ్డి, మల్లికంటి రాజు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదారం హైస్కూల్ రూపురేఖలు మారుస్తాం

కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా మాదారం హైస్కూల్ రూపురేఖలు మారుస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మంత్రి కనగల్ మండలంలోని మాదారం పాఠశాలను సందర్శించారు. 9వ తరగతి చదివే ఉమామహేశ్వర్‌కు ట్రై సైకిల్ మంజూరు చేశారు. తరగతి గదులకు రంగులు వేయడానికి అడ్వాన్సుగా రూ.50వేలను ఆ గ్రామ మాజీ సర్పంచ్ దేప నరేందర్‌రెడ్డికి మంత్రి అందించారు. వారం రోజుల్లోగా పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మ, కోమటిరెడ్డి బుచ్చి రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తిప్పర్తి : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చిలక శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని మంత్రి కోమటిరెడ్డి పరామర్శించి ఓదార్చారు.

నీటిని విడుదల చేయాలని విన్నపం

తిప్పర్తికి వచ్చిన మంత్రిని రైతులు కలిశారు. కాలువల ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. సెప్టెంబర్ రెండు నుంచి నీటిని విడుదల చేసి మండలంలో ఉన్న చెరువులన్నీ నింపుతామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, పాశం సంపత్‌రెడ్డి, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, నాగులవంచ లింగారావు, బద్దం సుధీర్, పుల్లెంల సైదులు తదితరులు పాల్గొన్నారు.



కనగల్ : విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కేతేపల్లి : దేశాభివృద్ధిలో గ్రామీణ ప్రాంత పాఠశాలల విద్యార్థులు భాగస్వాములు కావాలని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నాలుగు సార్లు సాధించిన విభిన్న పాత్రాభినయ కళాకారుడు, సమాజ సేవకుడు, రచయిత డా.పెండెం కృష్ణకుమార్ అన్నారు. గురువారం కేతేపల్లి మండలంలోని చెరుకుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దేశ నాయకుల చిత్రపటాలు, క్రీడా సామగ్రి, మెడికల్ కిట్స్, వాటర్ క్యాన్లు, పలుదేశాల చిత్ర పటాలు, క్లాత్ బ్యాగ్‌లను ఆయన అందజేసి మాట్లాడారు. హెచ్ఎం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రశంసలు పొందిన కృష్ణకుమార్ పాఠశాలను సందర్శించడంతో విద్యార్థుల్లో ఎంతో స్ఫూర్తి నింపిందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధు, రమేష్, వెంకట్‌రెడ్డి, రోమన్, కవి రాజు, వెంకట్‌మోహన్, సరిత, రేవతి తదితరులు పాల్గొన్నారు.



దేశ నాయకుల చిత్రపటాలు అందజేస్తున్న కృష్ణకుమార్

మంత్రి కోమటిరెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం

చిట్యాల: గుండ్రాంపల్లి గ్రామంలో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సుల స్టాప్ ఏర్పాటు చేయాలని ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పీఏసీఎస్ డైరెక్టర్ దోర్నాల రామచంద్రం ఇటీవల రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన మంత్రి.. గుండ్రాంపల్లిలో ఎక్స్‌ప్రెస్ బస్సుల స్టాప్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. దీంతో గురువారం గుండ్రాంపల్లి గ్రామంలో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్‌లు ఆగాయి. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఫ్లెక్సీలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నమ్ముల విజయ్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ దోర్నాల రామచంద్రం, మాజీ వైస్ ఎంపీపీ బండ కిష్టయ్య, మాజీ ఎంపీటీసీ దుబ్బ పద్మకుమారస్వామి, మాజీ సర్పంచ్ ఏసిరెడ్డి బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే

కట్టంగూర్ : మండలంలోని ఎరసానిగూడెం గ్రామంలో గురువారం వ్యవసాయశాఖ అధికారులు రుణమాఫీ కానీ రైతు వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రుణమాఫీ కాని 20 మంది రైతులు అధికారులకు దరఖాస్తు చేసుకోగా 15 మంది రైతుల వివరాలను వ్యవసాయ అధికారులు సేకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఏ గిరిప్రసాద్, ఏఈఓలు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

చండూరు : ఇటీవల ఆత్మహత్య చేసుకున్న పులిపాటి అంజయ్య కుటుంబానికి చండూరులో గురువారం పద్మశాలి సంఘం తరఫున జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తిని సత్యనారాయణ రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు అధైర్యపడవద్దని, సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గంజి రామలింగం, కార్యదర్శి మిర్యాల వెంకటేశం, వనం శేఖర్, పద్మశాలి సంఘం పట్టణ గౌరవ అధ్యక్షుడు పులిపాటి ప్రసన్న, అధ్యక్షుడు గుర్రం భిక్షమయ్య, కోమటి వీరేశం, ప్రధాన కార్యదర్శి గంజి శ్రీను పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ పోరు యాత్ర

చండూరు : సంక్షేమ వసతి గృహాలు, కస్తూరిబా, గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 నుంచి 6 వరకు పోరు యాత్ర నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ మునుగోడు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం చండూరు డాన్ బోస్కో జూనియర్ కళాశాలలో పోరు యాత్ర కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ పోరు యాత్ర సెప్టెంబర్ 2న చండూరులో ప్రారంభమై జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సన్నీ, నవదీప్, అభిలాష్, సుధాకర్, కార్తీక్, వేణు పవన్, మణి పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

నాంపల్లి : చిన్నారులకు సరైన పోషకాహారం అందించాలని మండల వైద్యాధికారులు ఇజ్రత్, తరుణ్ అన్నారు. నాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 36మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులతోపాటు అంగన్‌వాడీ కేంద్రల్లో సిబ్బంది.. చిన్నారులకు పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు.

కలెక్టర్‌కు వినతి

నల్లగొండ: ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగుల కోసం నల్లగొండలో ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ హాస్టల్ భవనం నిర్మించాలని కోరుతూ ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం నాయకులు గురువారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కట్టెల శివకుమార్, వేముల శేఖర్, పిట్టల శ్రీనివాస్, అల్లంపల్లి కొండన్న, నరేష్‌కుమార్, శివతేజ పాల్గొన్నారు.

బోనమెత్తిన పల్లెలు



కనగల్: దోరెపల్లిలో బోనాలతో వస్తున్న మహిళలు



మునుగోడు : బోనాలతో మహిళలు

కనగల్: మండల పరిధిలోని దోరెపల్లి గ్రామంలో బోనాల పండుగను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు బోనాలతో వచ్చి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా జి ఎడవెల్లి గ్రామపంచాయతీ పరిధి మదనాపురం గ్రామంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.

చిట్యాల: మండలంలోని తాళ్లవెల్లెంల, పెద్దకాపర్తి, నేరడ, చిట్యాల మున్సిపాలిటీలో గురువారం బోనాల పండుగను నిర్వహించుకున్నారు. గ్రామ దేవతలకు బోనాల్లో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వడ్డెపల్లి లక్ష్మయ్య, చికిలంమెట్ల సైదులు, జనగాం శేఖర్ పాల్గొన్నారు.

మునుగోడు: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ముత్యాలమ్మ బోనాల పండుగ ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనం కుండలో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చిట్యాల: ఏపూరు గ్రామంలో గౌడ కులస్తులు ఈదమ్మ తల్లి, మాంధాత బోనాల పండగను గురువారం జరుపుకున్నారు. గ్రామంలో ఈదమ్మతల్లి, మాంధాత మూర్తుల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులకు బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గౌడ సంఘం అధ్యక్షుడు వెంకటేశం, మునుకుంట్ల శివగౌడ్, గోపగోని శ్రీ నివాస్, లింగస్వామి, వెంకటేష్, సుధాకర్ పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలోని గ్రామ భారతి ఎదురుగా ఉన్న శ్రీ మడివాల మాచిదేవుడు సీతాలమ్మ ఈదమ్మల కల్యాణోత్సవం సందర్భంగా గురువారం భక్తులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి లోక వెంకటశర్మ, భక్తులు పాల్గొన్నారు.



కనగల్: మదనాపురంలో బోనాలతో వెళ్తున్న మహిళలు



చిట్యాల: నేరడలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు